క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం


బంగారు పతకంతో ఆనంది

కమాన్‌పూర్: హైదరబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో 18న నిర్వహించిన అండర్–16 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెం పోటీల్లో మండల కేంద్రానికి చెందిన నల్ల వెల్లి శంకర్ కూతురు ఆనంది బంగారు పతకం సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో జరిగే సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆనంది ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్లో పదో తరగతి చదువుతోంది. రాష్ట్ర స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ శివసేన రెడ్డి, రాష్ట్ర అథ్లెటిక్స్ జనరల్ సెక్రెటరీ సారంగపాణి, కోచ్ రమేశ్ విద్యార్థిని అభినందించారు.

సీఐకి సన్మానం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ సీఐ కార్యాలయంలో సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్‌ను గురువారం నూతనంగా ఏర్పడిన వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. జాతీయ వాలీబాల్ క్రీడాకారులు కన్న రమేశ్, జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రావు, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర వైస్ చర్మన్ లక్ష్మారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజయ్య ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ హనుమాన్‌నగర్ ఏరియా జనతా గ్యారేజ్‌లో మాజీ కార్పొరేటర్ స్టాలిన్‌గౌడ్ ఆధ్వర్యంలో శ్రీనేత్రాలయ కంటి హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఏఐటీయూసీ ఆర్జీ–2 ఏరియా బ్రాంచ్ కార్యదర్శి జీగురు రవీందర్, 18వ డివిజన్ కార్పొరేటర్ బాదె అంజలీదేవితో కలిసి ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన 200మందికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాలతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. అలాగే 18 మందిని కంటి ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. డాక్టర్ రమణారెడ్డి, రాజేందర్, సంజీవ్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

దళారులకు అడ్డాగా రామగుండం తహసీల్

రామగుండం: రామగుండం తహసీల్దార్ కార్యాలయం దళారులకు అడ్డాగా మారిందని, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టకుండానే కార్యాలయంలో దళారిగా, తహసీల్దార్ డ్రైవర్ పేరుతో చెలామణి అవుతున్న ఓ మీసేవా ఆపరేటర్ చెప్పిందే తడవుగా దరఖాస్తులపై అధికారులు సంతకాలు చేస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య ఆరోపించారు. గురువారం ఆయన పలు అంశాలతో కూడిన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి అర్హతలు లేని వారికి ధృవీకరణపత్రాలు జారీ చేస్తుండగా, పూర్తి అర్హతలు కలిగిన వారికి ధృవీకరణపత్రాల జారీలో కొర్రీలు పెడుతున్నారని విమర్శించారు. కార్యాలయంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనిపై తహసీల్దార్ ప్రత్యేక దృష్టిసారించి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు

గోదావరిఖనిటౌన్: మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా గురువారం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముందుగా తబీమ్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ హబీబ్, మహమ్మద్ హుస్సేన్ చిస్తి ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ లోని మదర్సా నుంచి కళ్యాణ్‌నగర్, రీగల్ షూ మార్ట్ మీదుగా ఊరేగింపు నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ


మాట్లాడుతున్న సీడీపీవో అలేఖ్య పటేల్

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్ సెక్టార్ పరిధిలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 4వ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం రామగుండం సీడీపీవో అలేఖ్యపటేల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులతో పాటు కేంద్రాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించారు. రిజిస్టర్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో పాటు కేంద్రం నిర్వహణ తీరు సరిగా లేకపోవడం, టీచర్, ఆయాలు సమయపాలన పాటించకపోవడం, కేంద్రంలో పాడైపోయిన ఆహారపదార్థాలు ఉండటం, అటెండెన్స్ రిజిస్టర్‌లో ముందస్తు సంతకాలు చేసి ఉండటాన్ని ఆమె గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రం టీచర్ దేవకర్ణతో పాటు ఆయా స్రవంతికి మెమో జారీ చేశారు. అంతకుముందు బసంత్‌నగర్ మసీద్ ఎదురుగా గల 3వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయ, సువర్ణ, అంజలి, సరస్వతి పాల్గొన్నారు.

సార్లు చూసి ‘బీర్’పోతున్నారు

- పాఠశాల ఆవరణలో మందుసీసాలు

విద్యార్థులకు పాఠాలు నేర్పే బడి బారుగా మారింది. ప్రతిజ్ఞ చేస్తూ వందేమాతరం చెప్పాల్సిన సార్లు పిల్లల ముందు పాఠశాల ఆవరణలో మందు సీసాలను చూస్తూ బీరిపోతున్నారు. పెద్దపల్లి జిల్లా నిట్టూరు గ్రామ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ఇక సెలవు రోజుల్లో అయితే చదువుల దేవాలయం మందు సీసాలు, ప్లేట్లతో నిండిపోతుందని టీచర్లు వాపోతున్నారు. అధికారులు చొరవ చూపి చదువుల దేవాలయానికి ప్రహరీ, గేటు ఏర్పాటు చేయించాలని విన్నవిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి


పాఠశాల ఆవరణలో బీర్ సీసాలు

పారిశుధ్యం మెరుగుపడితేనే స్వచ్ఛత


పెద్దపల్లిరూరల్: మొక్క నాటుతున్న వలంటీర్లు


గోదావరిఖనిటౌన్: శుభ్రం చేస్తున్న వలంటీర్లు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి డిగ్రీ, పీజీ కాలేజీలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ ఒడ్డున ఉన్న పిచ్చిమొక్కలను శ్రమదానంతో తొలగించారు. పలురకాల మొక్కలను నాటారు. పారిశుధ్యం మెరుగుపడితేనే స్వచ్ఛత నెలకొంటుందని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ అన్నారు. వలంటీర్లతో ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ నీతారెడ్డి, ప్రోగ్రాం అధికారి అశ్విని, సంజీవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో స్వచ్ఛతాహీ సేవా

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు కళాశాలలోని పిచ్చి మొక్కలను, వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రెహమాన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి జీడి కనుకయ్య, లైబ్రేరియన్ శంకరయ్య, అధ్యాపకులు సతీశ్, ప్రియదర్శిని, శైలజ, రమాదేవి, రామ్మూర్తి, రఫీక్ పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: స్థానిక విఠల్‌నగర్ ఏరియాలో సింగరేణి యాజమాన్యం నిర్మించిన ఆర్వోవాటర్ ప్లాంట్‌ను ప్రారంభించాలని నాయకులు బొడ్డు రవీందర్ కోరారు. గురువారం ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2003లో నిర్మాణం పనులు ప్రారంభించి పూర్తయినప్పటికీ ప్రారంభించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించి త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నాయకులు నారాయణదాసు మారుతి, బుర్రి వెంకన్న, వెంకటేశ్, కుమార్, విజయ్, రామరాజు, చింటూ ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి


సభ్యత్వ పత్రాలు అందజేస్తున్న సంధ్యారాణి

గోదావరిఖని: బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె నూతన సభ్యత్వ పత్రాలు అందజేశారు. సమావేశంలో సభ్యత్వ ప్రముఖ్ క్యాతం వెంకటరమణ, కోడూరి రమేశ్, గుండబోయిన భూమయ్య, నవీన్ గౌడ్, పంగ రవి, ఇప్ప నరసింహులు, అందె రాజ్‌కుమార్, బొడ్డుపల్లి రంజిత్, మచ్చ విశ్వాస్, ప్రవీణ్, బియ్యాల మహేందర్, గజ్జెల భాస్కర్, దాసరి సుమలత, రెవెల్లి పద్మ, స్వప్న పాల్గొన్నారు.

సింగరేణిని కాపాడేందుకే రాజకీయ జోక్యం


మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి సంస్థను కాపాడేందుకే రాజకీయ జోక్యం తప్ప తమ స్వార్థం కోసం కాదని ఐఎన్‌టీయూసీ నేత నర్సింహారెడ్డి అన్నారు. జీడీకే–1గనిలో గురువారం జరిగిన గేట్ మీటింగ్, స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ జోక్యంతో కార్మికులకు న్యాయం చేసేలా చేస్తున్నామన్నారు. కార్మికులకు సంబంధించిన పెర్క్స్‌పై విధించే ఇన్కమ్ ట్యాక్స్ రద్దు చేయిస్తామని, సంస్థ సాధించిన లాభాల్లో వాటాను కార్మికులకు రానున్న 15రోజుల్లో అందజేసేలా చూస్తామన్నారు. సమావేశంలో నాయకులు వడ్డేపల్లి దాస్, కె.సదానందం, జనగామ రాజేశం, గడ్డం కృష్ణ, బేబీ శ్రీనివాస్, పోతరవేని సమ్మయ్య, మల్లికార్జున్, మండ రమేశ్, గుండేటి శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్, బూర జగన్, గడ్డం వెంకటేశ్వర్లు, టి.రాజయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

జ్యోతినగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించేలా జీవోలను వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈసంపల్లి రాజేందర్ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయడంతో పాటు మూడు నేర చట్టాల సవరణను రద్దు చేయాలని కోరారు. అసంఘటితరంగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 30న హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా కోశాధికారి నాగభూషణం, రాజేంద్రప్రజాద్, రాజు, ఉప్పులేటి ప్రభాకర్, మనోజ్, దేవన్న పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలి

సుల్తానాబాద్: గ్రామంలో రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోకుండా పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీరు పట్టాలని డీపీవో వీరబుచ్చయ్య పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి గురువారం వచ్చిన సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలఖారురులోగా 80శాతానికి పైగా ఇంటి పన్ను వసూలు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, డీఎల్‌పీవో వేణుగోపాల్, మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ప్రకటించాలి

రామగిరి: సింగరేణి సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరానికి వచ్చిన లాభాల్లో కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ప్రకటించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్జీ–3 జీఎం కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న, సహాయ కార్యదర్శి రాజేందర్, నాయకులు రమేశ్, రాజన్న, శ్రీనివాస్, లింగన్న, సత్తయ్య పాల్గొన్నారు.

ఏచూరి మరణం తీరని లోటు

రామగుండం: ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం జాతీయ నాయకుడిగా అంచెలంచెలుగా జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగిన సీతారం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.శంకర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.రామాచారి అన్నారు. రామగుండంలోని పార్టీ కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. మల్లేశ్, శ్రీనివాస్, వై.సత్యనారాయణ, పోశం, సీహెచ్.రాజు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● బేస్ వర్క్‌షాప్‌లో కార్మికునికి గాయాలు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3 బేస్‌వర్క్‌షాప్‌లో గురువారం గ్రీజర్ హెల్పర్ రాంరెడ్డికి గాయాలయ్యాయి. మొదటిషిఫ్టులో పనులు నిర్వహిస్తున్న క్రమంలో జాక్‌రాడ్ పడటంతో కాలుకు ఫ్రాక్చర్ అయ్యింది. ఇతడిని గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

● రేషన్ బియ్యం పట్టివేత

మంథని: మండలంలోని నాగారంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్ తెలిపారు. బుధవారం రాత్రి సివిల్ సప్లై కమిషనర్ కార్యాలయ ఓఎస్డీ ప్రభాకర్‌రెడ్డి పక్కా సమాచారంతో నాగారం గ్రామంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. మినీ డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 48.8 క్వింటాళ్ల రేషన్ బియ్యం తనిఖీల్లో పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం, మినీ డీసీఎం వ్యాన్ సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన బియ్యం మంథని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించి, డీసీఎం వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు పౌరసరఫరాల అధికారి తెలిపారు. వాహనం యజమాని, డ్రైవర్, అక్కడ పనిచేస్తున్న ఇతర వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యం విలువ రూ.2.78లక్షల విలువ ఉంటుందని తెలిపారు.

● అదుపుతప్పి కారు బోల్తా

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్ గ్రామశివారులో అదుపు తప్పి కారు బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పుట్నూర్‌కు చెందిన మాదాసు శ్రావణ్‌తో పాటు జయ్యారం గ్రామానికి చెందిన కొత్తూరి సంతోష్, భూషనవేని సాయి, వడ్లకొండ అనిల్, శ్రీరాముల సాయి కారులో కుక్కలగూడూర్ నుంచి పుట్నూర్ వైపు కారులో వస్తున్నారు. ఈక్రమంలో కారు అదుపుతప్పి రహదారి పక్కన గల చెట్లను ఢీకొట్టి సమీపంలోని పొలంలోకి దూసుకెళ్లింది. కారులోని ఎయిర్‌బెలూన్స్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మరో కారులో ఆసుపత్రికి తరలించారు.

● హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్ఎఫ్‌సీఎల్‌లో 2023లో ఎఫ్‌సీఐ ఎల్కలపల్లి గేట్‌కు చెందిన గీత కార్మికుడు కొయ్యాడ వెంకన్నగౌడ్‌పై గోదావరిఖనికి చెందిన ఎస్‌కే సమీర్, సయ్యద్ వాజీద్ కత్తితో విచక్షణారహితంగా దాడి చేశారు. హత్యాయత్నం కేసులో కేసు దర్యాప్తు అనంతరం గురువారం గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి అసిస్టెంట్ స్పెషల్ బి.శ్రీనివాసులు.. నిందితులైన సమీర్, సయ్యద్ వాజీద్‌కు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.3వేల జరిమానా విధించారు. కేసు విచారణ అ ధికారి నాటి ఎస్సై జీవన్, ఎస్సై సతీశ్, సిబ్బందిని రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ అభినందించారు.

● గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడి మృతి

పాలకుర్తి: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని రజ్వీకాలనీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం (40) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు.

● తెగుళ్లు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జూలపల్లి: వరిపంటకు బ్యాక్టీరియా, అగ్గితెగులు సోకకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తంబ ప్రత్యూష సూచించారు. మండలంలోని కాచాపూర్‌లో రైతులతో కలిసి ఆమె వరిపంటలను పరిశీలించారు.

● రహదారికి మరమ్మతు పనులు

ఎలిగేడు: కొన్నిరోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రాములపల్లి శ్రీనాగలింగేశ్వర స్వామి ఆలయం నుంచి సుల్తానాబాద్‌కు వెళ్లే మార్గంలో వాగు వద్ద రోడ్డు దెబ్బతిన్నది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా గురువారం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టి పూర్తి చేశారు.

● పద్మశాలీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

జూలపల్లి: మండలంలోని తేలుకుంట పద్మశాలీ సంక్షేమ సంఘం గ్రామ కమిటీ ఎన్నికలు గురువారం గ్రామంలో ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా దొంతుల రాజమల్లు, గౌరవాధ్యక్షుడిగా వెంగళ కనుకయ్య, ఉపాధ్యక్షునిగా సిరిపురం కనుకయ్య, కార్యవర్గ సభ్యులుగా చిప్ప రమేశ్, భూర్ల లక్ష్మయ్య, బొద్దుల నారాయణ, గ్యాజంగి రాజేశం, అనుమండ్ల శంకరయ్య, బండి రాములు, బండి నరేశ్, అనుమండ్ల రాజేశం ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను మాజీ జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మన్, మండల సంఘం అధ్యక్షుడు దేవసాని లక్ష్మీపతి, యూత్ అధ్యక్షుడు మేరుగు రమేశ్ అభినందించారు.

● రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్ సెయింట్ క్లేర్ హైస్కూల్ విద్యార్థిని జి.నిశ్రిత రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. నిశ్రిత అండర్–14 విభాగంలో 60మీటర్లు, 600 మీటర్ల పరుగుపందెం పోటీల్లో ఎంపికైన విషయాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొమ్ము గట్టయ్య గురువారం తెలిపారు. 20న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నిశ్రిత పాల్గొంటుందని పేర్కొన్నారు.

● రోడ్డుకు మరమ్మతు

ఓదెల: మండలంలోని కొమిర–బీమరిపల్లె రోడ్డుకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి సొంత ఖర్చులతో మరమ్మతు చేశారు. గురువారం జేసీబీ సాయంతో కొమిర నుంచి బీమరిపల్లె వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొదలను తొలగించి రోడ్డును బాగుచేయించారు.


సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో గడ్డి పెరిగింది. దీంతో పాటు నీరు నిల్వ ఉండడంతో వాకర్స్‌తోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది, అధికారులు చొరవ తీసుకొని గ్రౌండ్‌ను వెంటనే శుభ్రం చేయించాలని వాకర్స్, విద్యార్థులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన ప్రజాప్రతినిధి : గాజుల లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, సుల్తానాబాద్, సెల్ నంబర్ : 97047 04666

వాట్సప్ చేయండి..

మా ఫోన్ నంబర్ : 98499 71500

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

సింగరేణి వార్తలు

కార్మికులకు ఇబ్బంది లేకుండా చూడాలి


క్వార్టర్లను తనిఖీ చేస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం వెనకడుగు వేసే ప్రసక్తేలేదని ఆర్జీ–1 జీఎం డి.లలిత్ కుమార్ అన్నారు. కార్మిక వాడల్లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సదుపాయాలు, సౌకర్యాలను పరిశీలించారు. క్వార్టర్లలో విద్యుత్, తాగునీటి సరఫరా, సివిల్ వర్క్స్, ఎలక్ట్రికల్‌కు సంబంధించిన సమస్యలను కార్మిక కుటుంబాల నుంచి తెలుసుకున్నారు. నీటి సరఫరా తీరుపై ఆరా తీశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, క్వార్టర్ల మరమ్మతు సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. క్వార్టర్ల వద్ద చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్మిక కుటుంబాలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ అరెల్లి పోషం, ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఏరియా ఇంజినీర్ దాసరి వెంకటేశ్వర్‌రావు, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, వర్క్‌షాప్ డీజీఎం జితేందర్‌సింగ్, సర్వే అధికారి ప్రభాకర్, డీవైఎస్సీ వసంత్‌కుమార్, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, ఫారెస్ట్ అధికారి కర్ణ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం

గోదావరిఖని: పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా ముందుకు సాగాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ కోరారు. కోల్ మినిస్ట్రీ ఆదేశాల మేరకు గురువారం స్థానిక పవర్‌హౌస్‌కాలనీలో చెత్తను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలలో చెత్త, చెదారం వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు రామ్మోహన్, నాయకులు స్వామి, అరెల్లి పోషం, కిరణ్‌బాబు, దాసరి వెంకటేశ్వర్‌రావు, ఆంజనేయ ప్రసాద్, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్, హనుమంతరావు పాల్గొన్నారు.

గ్రంథాలయం సందర్శన

గోదావరిఖనిటౌన్: స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమంలో భాగంగా స్థానిక పవర్‌హౌస్‌కాలనీలోని గోదావరిఖని శాఖ గ్రంథలయాన్ని గురువారం ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ సందర్శించారు. పాఠకులతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని జీఎం హామీ ఇచ్చారు. సింగరేణి అధికారి రవీందర్ రెడ్డి, వీరారెడ్డి, లైబ్రేరియన్ ఎం.భారతి ఉన్నారు.

కాలనీ సుందరీకరణ పనులు ప్రారంభం


పనులు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు సింగరేణి ప్రభావిత యైటింక్లయిన్‌కాలనీలోని పలు డివిజన్లలో గురువారం ఆర్జీ–2ఏరియా సింగరేణి అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. సింగరేణి స్థలాల క్రమబద్ధీకరణ విషయంలో త్వరగా సర్వే నిర్వహించి అర్హులైన వారికి పట్టాలు అందేలా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే సింగరేణి అధికారులకు సూచించారు. 18వ డివిజన్ అల్లూరు పెట్రోల్ బంకు వరకు ఓపెన్ డ్రైనేజీ నిర్మాణ పనులు, యైటింక్లయిన్‌కాలనీకి సంబంధించిన గ్రౌండ్ సుందరీకరణ, ఓపెన్‌జిమ్ ఏర్పాటు, మహిళల కోసం ఆఫీస్ ఏర్పాటు, బతుకమ్మ స్థలాల వద్ద ప్లాట్‌ఫామ్స్, విద్యుత్ లైట్లు ఏర్పాటు, అల్లూరు శ్మశాన వాటిక నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మాణం, 19వ డివిజన్ పోతన కాలనీ రైల్వేగేట్ వద్ద ఉన్న సర్కిల్ తొలగింపు, న్యూమారేడుపాక గ్రామ అభివృద్ధి తదితర పనులను పరిశీలించారు. త్వరలోనే యైటింక్లయిన్‌కాలనీ సుందరీకరణంగా మారబోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, మార్క రాజు, రాకేశ్, రాయలింగు, అంజయ్య, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ ఉచిత శిక్షణ

గోదావరిఖని: వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ ఉచిత శిక్షణను సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆర్జీ–1 జీఎం డి.లలిత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి పరిసర గ్రామాల యువత, ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలకు వైద్యపరంగా ఫిట్‌నెస్ ఉన్న అభ్యర్థులకు వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ ప్రాథమిక ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 50మంది బ్యాచ్‌తో శిక్షణ ప్రారంభించనున్నట్లు వివరించారు. 18 నుంచి 35ఏళ్లలోపు ఉన్న యువతకు ఓసీపీల్లోని ప్రయివేట్ ఓబీలో హెవీ వెహికల్ నడపడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. వివరాలకు ఆర్జీ–1 జీవీటీసీలో సంప్రదించాలని, దరఖాస్తులు 30వ తేదీలోగా అందజేయాలని కోరారు.

ఆదివారంపేటలో వసతులు కల్పించండి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రామగిరి: సింగరేణి నిర్వాసిత గ్రామమైన ఆదివారంపేటలో వసతులు కల్పించాలని గురువారం ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావుకు మైదం వరప్రసాద్ వినతిపత్రం అందజేశారు. నాలుగేళ్ల క్రితం సింగరేణి సంస్థ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి దాని పర్యవేక్షణ మర్చిపోయారన్నారు. గ్రామంలో ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మైదం బుచ్చయ్య, గ్రామస్తులు చింతం శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం సత్యనారాయణగౌడ్, ఎలువాక తిరుపతి, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

మంథని: ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ సత్యానందం అన్నారు. మంథనిలోని బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. వ్యాధిపై అనుమానాలుంటే 1097కి ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.